ఫుట్‌పాత్ ఆక్రమణలు

- వ్యాపారుల ఇష్టారాజ్యం
- రోడ్డుపైనే క్రయవిక్రయాలు
- ప్రమాదాల బారిన పాదచారులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం

అసలే జాతీయ రహదారి. ఆపై వాహనాల రద్దీ. దీనికి తోడు వ్యాపారుల ఇష్టారాజ్యం. వెరసి రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ఫుట్‌పాత్‌లను దుకాణదారులు ఆక్రమించి వ్యాపారం చేస్తున్నారు. దీంతో మరో మార్గం లేక ప్రజలు.. రోడ్డు దాటుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం లేదు.


ఫుట్‌పాత్‌పై దుకాణ సామగ్రి

పరిగి: పట్టణంలో నుంచి బీజాపూర్ జాతీయ రహదారి ఉండటంతో సహజంగానే వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ట్రాఫిక్ అధికంగా ఉండే రోడ్డుకు.. ఇరువైపులా ఫుట్‌పాతలను ఏర్పాటు చేశారు. అలా పాదచారుల కోసం ఏర్పాటు చేసిన బాటలు వ్యాపారులకు అడ్డాగా మారాయి. రోడ్డు పక్కనే ఉన్న దుకాణ దారులు తమ విక్రయ సామగ్రిని ఫుట్‌పాత్‌లపై పెట్టి దర్జాగా వ్యాపారం చేయడం నిత్యకృత్యంగా మారింది. దీంతో ఫుట్‌పాత్‌లపై నడవాల్సిన ప్రజలు.. రోడ్డుపై నడవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలా కాలినడక బాటను ఆక్రమించుకొని వ్యాపారం చేస్తున్న దుకాణదారులపై సబంధిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు తొలగించాలని పలు మార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. అసలే జాతీయ రహదారి.. ఆపై రోడ్డుకిరువైపులా ఆక్రమణలు పెరగడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందిగా మారింది. రద్దీ ప్రాంతం కావడంతో రోడ్డుపై నడవాల్సి వస్తోంది. ఎప్పుడు ఎటునుంచి ఏ వాహనం దూసుకొస్తుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

దర్జాగా వ్యాపారాలు

కాలినడక కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లపై కొందరు దర్జాగా వ్యాపారం చేస్తున్నారు. మూడేళ్ల క్రితం బీజాపూర్ జాతీయ రహదారిగా రోడ్డు విస్తరించారు. దీంతో రవాణశాఖ పాదాచారుల సౌకర్యం కోసం ఫూట్‌పాత్‌లను ఏర్పాటు చేసింది. అలా నిర్మించిన నాటి నుంచి ఆ బాటలను వ్యాపారులు ఆక్రమించి పాదచారులకు ఇబ్బంది కరంగా మారారు. ఇలా పరిగిలో దాదాపుగా 4 కిలో మీటర్ల మేర ఫుట్‌పాత్‌ను వ్యాపారులు ఆక్రమించి, సామగ్రి పేర్చడంతో పాటు.. పలువురు ఏకంగా గోడలు నిర్మించారు. గతంలో కలెక్టర్ ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన వ్యాపారాలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించినా పట్టించుకోవడం లేదని, నెలనెలా వ్యాపారుల నుంచి మునిసిపాలిటీ అధికారులు, సిబ్బందికి నెలనెలా ప్రతి దుకాణం నుంచి మామూళ్లు ముడుతుండడంతోనే వారు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టి.. పాదచారుల ఇబ్బందులు తొలగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తప్పవు



ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేస్తే చర్యలు తీసుకుంటాం. పాదచారుల కోసం ఏర్పాటు చేసిన బాటను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కూల్చివేయడంతో పాటు.. సంబంధితులపై కఠిన చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు వెంటనే ఫుట్‌పాత్‌లపై పెట్టిన సామగ్రిని తొలగించాలి.

– శ్రీనివాసన్, మున్సిపల్ కమిషనర్, పరిగి

ఆక్రమణలను కట్టడి చేయాలి



ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు పలుమార్లు విన్నవించాం. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. కాలిబాటపై క్రయవిక్రయాలు జరుపుతుండడంతో ప్రజలు రోడ్లపై నడవాల్సి వస్తోంది. వెంటనే ఆక్రమణలను తొలగించాలి.

– వెంకటయ్య, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

వికారాబాద్ అర్బన్: గ్రామ పంచాయతీ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని టీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీపీఓ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్మికులకు వేతనాలు ఇప్పించాలని కోరారు. మూడు నెలల నుంచి కార్మికులకు జీతాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జీతాలు ఇవ్వాలని అడిగితే కొందరు సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపించారు. వేతనాలు ఇవ్వకుండా పని చేయించుకోవడం దారుణమని, మూడు రోజుల్లో జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో టీఆర్‌ఎస్‌కేవీ ఆధ్వర్యంలో డీపీఓ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కృష్ణ

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా కృష్ణను నియమించినట్లు మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కృష్ణకు బుధవారం నియామక పత్రం అందజేసి మాట్లాడారు. పార్టీ అప్పగించిన పనిని సమర్థవంతంగా నిర్వహించాలని పార్టీ నేతలకు ఆయన సూచించారు. రానున్న ఎన్నికల్లో పార్టీని ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు వెంకటేశం, శుభాష్‌గౌడ్, సురేందర్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధికి చర్యలు



పాఠశాలకు కుర్చీలు అందజేస్తున్న ఉపసర్పంచ్ శ్రీకాంత్

దోమ: పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉపసర్పంచ్ కరణం శ్రీకాంత్ రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మోత్కుర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులకు కుర్చీలు అందజేసి మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడూ గ్రామ పంచాయతీ ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులకు ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా.. ఉపాధ్యాయులు తమను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, గ్రామస్తులు నర్సింహులు, హన్మంతు, మల్లేశం, శ్రీను, నాగేశ్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

మర్పల్లి: ఆత్మరక్షణ కోసం బాలికలు కరాటే విద్యను నేర్చుకోవాలని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల ఎస్‌ఓ శైలజ అన్నారు. ఆడపిల్లలకు కరాటే నేర్పించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థినులకు ప్రభుత్వం నెల రోజుల పాటు (రాణి లక్ష్మీ బాయి సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రాం ఫర్ గరల్స్) పేరుతో ఉదయం, సాయంత్రం వేళలో కరాటే తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో విద్యార్థినులకు కరాటే మాస్టర్ సంగప్ప కరాటే విద్యలో మెళకువలు నేర్పించారు. మాస్టర్ చెప్పే కరాటే విద్యను విద్యార్థినులు క్రమశిక్షణతో నేర్చుకోవాలని చెప్పారు. ఈ తరగతులు ఈ నెల 23వరకు ఉంటాయని తెలిపారు.

మల్లికార్జునస్వామి ఆలయ నూతన కమిటీ ఎన్నిక


నూతన సభ్యులను సన్మానిస్తున్న సర్పంచు తదితరులు

మోమిన్‌పేట: దుర్గంచేర్వు గ్రామంలో వెలసిన మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్‌గా పట్లోళ్ల రాజేశ్వర్‌ను నియమించినట్లు సర్పంచు హరి శంకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆశీస్సులతో దేవదాయశాఖ ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. ఉపాధ్యక్షుడిగా బాలరాజ్, కమిటీ సభ్యులుగా ఆనందం, రచ్చయ్య, సుకృత, బాలమణి, ప్రభులింగంను ఎంపిక చేసినట్లు సర్పంచు వెల్లడించారు. ఈ సందర్భంగా నూతన పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామని చెప్పారు.

మల్లన్న సన్నిధికి శివభక్తులు


పెద్దేముల్: శివ భక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న ముస్లింలు

పెద్దేముల్: శ్రీశైలం మల్లికార్జునుడి చెంతకు మండల హన్మాపూర్ శివ మాలధారులు బుధవారం బయలుదేరి వెళ్లారు. దీక్ష పూర్తి చేసిన శివ భక్తులకు గురుస్వాములు ఇరుముడి కట్టారు. హన్మాపూర్ మాజీ సర్పంచు నర్సింహులు సొంత ఖర్చుతో 60మందికి పైగా భక్తులను బస్సులో శ్రీశైలం తీసుకు వెళ్లారు. ఇదిలా ఉండగా.. తాండూరుకు చెందిన రహీం (కుటుంబ సమేతంగా), పట్లోళ్ల నర్సింహులు, ఇందూరు ఎంపీటీసీ ప్రవీణ్‌పటేల్, శంకర్‌యాదవ్, మల్లప్ప శివ భక్తులకు పండ్లు, అల్పాహారం పంపిణీ చేశారు.

మల్లికార్జునుడి చెంతకు..

బషీరాబాద్: మండల కేంద్రం నుంచి పలువురు శివమాలధారులు (భక్తులు) శ్రీశైలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఏటా శివరాత్రి రోజున మల్లికార్జున స్వామిని దర్శించుకునేలా ఇక్కడి నుంచి వెళ్తుంటామని భక్తులు చెప్పారు.

నేడు హాత్‌సే హాత్ జోడో

కుల్కచర్ల: మండల పరిధిలో జరిగే హాత్ సే హాత్ జోడో కార్యక్రమానికి కార్యకర్తలు భారీగా హాజరై.. విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ముజాహిద్‌పూర్ కటింగ్ నుంచి లింగంపల్లి మీదుగా తిర్మలాపూర్ నుంచి మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం అంతారం, పుట్టపహాడ్ గ్రామాల మీదుగా గండీడు మండలంలో కార్యక్రమాన్ని కొనసాగిస్తారని తెలిపారు.

వ్యవసాయ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

బషీరాబాద్ ఎంపీపీ కరుణ


శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ కరుణ తదితరులు

బషీరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, అందుకే రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని ఎంపీపీ కరుణ అన్నారు. బుధవారం నావంద్గీ రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన శనగల కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు రైతులు రుణపడి ఉండాలన్నారు. రైతు రుణమాఫీ, రైతుబంధు, రైతుబీమా, దాన్యపు కొనుగోలు వంటి అనేక రైతు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ కేసీఆర్.. రైతుపక్షపాతిగా నిలిచారని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘం రైతులకు అండగా ఉంటుందని, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి పథంలో తీసుకువచ్చి, వాటిఫలాలను రైతులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రియాంక, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాభివృద్ధి

పెద్దేముల్: ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని గాజీపూర్ సర్పంచ్ వీరప్ప అన్నారు. బుధవారం గాజీపూర్ గ్రామంలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రతి జీపీ అభివృద్ధికి రూ.50లక్షల నిధులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య, గ్రామస్తులు గుండప్ప, రాములు, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోండి

మర్పల్లి: టీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్(రవాణ) సేవలను వినియోగించుకోవాలని లాజిస్టిక్ ఏజెంట్ రమేష్ మిత్ర వ్యాపారులకు సూచించారు. బుధవారం వికారాబాద్, తాండూర్, పరిగి డిపోల లాజిస్టిక్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్.. వ్యాపారులకు రవాణా సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధరల పట్టికతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, వ్యాపారులు తదితరులు ఉన్నారు.

శివ భక్తుల దాడి అమానుషం

యాలాల: మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన మెట్టి నరేష్‌పై ఇటీవల శివ భక్తులు మూకుమ్మడి దాడికి పాల్పడటం అమానుషం అని దళిత సంఘ నాయకులు అన్నారు. బుధవారం శివ భక్తుల దాడిలో గాయపడిన నరేష్‌ను పరామర్శించి మాట్లాడారు. దళిత యువకుడిపై దాడికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, బజరంగ్‌దళ్, కృష్ణ ధర్మ రక్షణ పేరుతో దాడికి ప్రేరేపించాయని ఆరోపించారు. యాలాల పీఎస్‌లో దాడికి పాల్పడిన శివస్వాములను సీసీ పుటేజీల ద్వారా గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉప్పలి మల్కయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమప్ప, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొత్తూరు చంద్రయ్య, ఎంఆర్‌పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు మెట్టి ఆశన్న, నాయకులు డప్పు మహేందర్, నరేందర్, మాల రాంబాబు, గుమ్మడి రత్నం, కిష్టప్ప, రాములు, మెట్టి కృష్ణ తదితరులు ఉన్నారు.

'పార్టీ బలోపేతానికి కృషి చేయండి'

పూడూరు: పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చన్గోముల్ గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సైనికుల్లా పని చేసి, పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, గంగాధర్‌గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించాలి

పరిగి: సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులు ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి, ప్రజలతో మాట్లాడి వారి ఇబ్బందులు, గ్రామ సమస్యలు తెలుసుకొని పరిష్కారమార్గం చూపాలని ఎంపీపీ అరవింద్‌రావు అన్నారు. బుధవారం మండల పరిషత్ హాల్లో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పల్లెప్రగతి కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పారిశుద్ధ్య, హరితహార అవగాహన సదస్సులో ఎంపీపీ అరవింద్‌రావు మాట్లాడారు. గ్రామాల్లోని రోడ్లను ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. సీసీ, బీటీరోడ్లపై పేరుకు పోయిన మట్టిని తొలగించి, మురుగు కాలువలను శుభ్రం చేయించేలా చర్యలు చేపట్టాలన్నారు. నాటిన మొక్కలు సక్రమంగా పెరిగాయా.. ఏమైనా చనిపోయా అని పరిశీలించాలన్నారు. నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరి షర్మ, ఎంపీఓ దయానంద్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు వేగంగా నడపొద్దు


ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి: సీఐ

ధారూరు: అతి వేగంగా ఆటోలు నడిపి ప్రాణహానికి కారకులు కావొద్దని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలనీ ధారూరు సర్కిల్ సీఐ అప్పయ్య ఆటో డ్రైవర్లకు సూచించారు. బుధవారం ఆయన స్థానిక ధారూరు పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని, డ్రైవింగ్ లైసెన్సులు కలిగి ఉండాలని ఆయన చెప్పారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటించని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సులు ఆగేచోట ఆటోలను నిలుపరాదని, డ్రైవర్లు పర్మిట్‌కార్డు, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ నరేందర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

మీసేవ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లు


మీసేవ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్ కుమార్

కుల్కచర్ల: ధరణి అంశాలపై రైతులకు ఇబ్బందులు కలగకుండా మీసేవ కేంద్రాల్లో హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రమేష్‌కుమార్ అన్నారు. బుధవారం తహసీల్ కార్యాలయంలో మీసేవ కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. ధరణి అంశాలకు సంబంధించిన భూ క్రమవిక్రయాల్లో రైతులకు అవసరమైన పూర్తి సమాచారం ఇచ్చిన అనంతరం అందుకు అవసరమైన చెల్లింపులతో స్లాట్స్ బుక్ చేయాలని చెప్పారు. ఇబ్బందికరంగా ఉండే భూ క్రమవిక్రయాల్లో రెవెన్యూ సిబ్బంది సూచనలు అనుసరించి స్లాట్ బుక్ చేస్తూ రైతులు ఆర్థికంగా నష్టపోకుండా చూడాలని సూచించారు. రైతులకు ఇబ్బంది కలిగే విధంగా ప్రవర్తిస్తే మీసేవ కేంద్రాలను రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గిర్దవరి ఖాజ, మీసేవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠింపజేస్తున్న వేదపండితులు

తాండూరు రూరల్: చెంగోల్ మల్లిఖార్జున స్వామి దేవస్థానం 21వ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. తట్టెపల్లికి చెందిన కల్వ వైష్ణవి తిప్పయ్యరాజు ధ్వజ స్తంభాన్ని విరాళంగా అందజేయగా.. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, దేవాలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల కల్యాణం

చెంగోల్‌లో గురువారం మధ్యాహ్నం 12.05 గంటలకు శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నట్లు దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. కావున భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

శివారెడ్డిపల్లిలో పంటకోత ప్రయోగం


శనగపంటను అంచనా వేస్తున్న గణాంకాల అధికారి రఘురాం

దోమ: రైతులు సాగు చేసే పంటలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని పరిగి డివిజన్ గణాంకాల అధికారి రఘురాం సూచించారు. బుధవారం దోమ మండలం శివారెడ్డిపల్లిలో బసమ్మ పొలంలో శనగ పంటను అంచనా వేశారు. ముందుగా పంటను ఐదు మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పు తీసుకొని అంచనా వేయగా.. 3.245 కిలోలు వచ్చిందని తెలిపారు. దీంతో ఎకరానికి నాలుగు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతుకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సాగు చేస్తున్న పంటల్లో రైతులు మెలకువలు పాటించాలన్నారు. అధికారులు సూచిస్తున్న సాగు విధానాలను పాటిస్తూ అధిక దిగుబడులను పొందేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల గణాంకాల అధికారి సందీప్ రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' నిరుపేదలకు వరం

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్


కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

పరిగి: కంటివెలుగు కార్యక్రమం నిరుదపేలకు వరం అని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. బుధవారం నాలుగో వార్డులో కంటి వెలుగు శిబిరం ప్రారంభించి మాట్లాడారు. నేత్ర శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్వేంద్రియానం నయనం ప్రధానమని, అందుకోసమే సీఎం కేసీఆర్ కంటి వెలుగును తీసుకువచ్చి అంధత్వ నివారణకు పాటుపడుతున్నారని చెప్పారు. మొదటి విడతలో ఎంతో మందికి కంటి చూపు సమస్యలు పరిష్కారం అయ్యాయని, వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసన్, కౌన్సిలర్లు, రవీందర్, కృష్ణ, నాగేశ్వర్ పాల్గొన్నారు.

'యోగా' తరగతులు సద్వినియోగం చేసుకోండి

పరిగి: పట్టణ కేంద్రంలో పది రోజుల పాటు నిర్వహించే ధ్యాన యోగా శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్ అన్నారు. లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. 9 నుంచి ప్రతి రోజు రెండు బ్యాచులుగా శిక్షణా తరగుతులు ప్రారంభం అవుతాయని, ఉదయం 5.30 గంటల నుంచి 7గంటల వరకు, సాయంత్రం 6గంటల నుంచి 7.30 గంటల వరకు తరగతులు ఏర్పాటు చేశామని, శివానంద ఆచార్యులు తరగతులు ప్రారంభిస్తారని చెప్పారు.

ప్రైవేటుకు దీటుగా సర్కారు బడులు


విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న కౌన్సిలర్ తదితరులు

తాండూరు టౌన్: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడుల్లో మెరుగైన విద్యను అందిస్తున్నట్లు 20వ వార్డు కౌన్సిలర్ సంగీత అన్నారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కార్యాచరణ పుస్తకాలను అందజేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'తల్లిదండ్రుల సహకారం' అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన కౌన్సిలర్ మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసిందని, పేద, మధ్య తరగతి పిల్లలకు గురుకులాలను ఏర్పాటుచేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిందని తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలు హోంవర్క్ చేసేవిధంగా, శుభ్రత పాటించేలా శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాములు, ఉపాధ్యాయులు మాధవి, రాణి తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించాలి

ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్


మాట్లాడుతున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్

కొడంగల్: ప్రభుత్వ అధికారులు ప్రజా సమస్యలపై స్పందించాలని ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ప్రస్తావిస్తూ.. వాటి పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని కోరారు. ఇంటింటికీ తాగునీరు, పోడు భూములు, ఉచిత కరెంటు, రైతులకు అవగాహన, రుణమాఫీ, కల్యాణలక్ష్మి తదితర అంశాలను సభదృష్టికి తేస్తూ.. వాటి పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని ఎంపీపీ చెప్పారు. ఎంపీడీఓ పాండు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


కార్యాలయం వెలుపల కూర్చొని వీసీ చూస్తున్న పంచాయతీ కార్యదర్శులు

వీసీకి తప్పని తిప్పలు

సరిపోని హాలు.. ఆరుబయట కుర్చీలే దిక్కు

దోమ: అధికారులకు, ప్రజాప్రతినిధులకు జిల్లా స్థాయి అధికారులు నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లతో సమస్య తలెత్తింది. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలెక్టర్ నారాయణ్ రెడ్డి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీసీకి అధికారులు, ప్రజాప్రతినిధులందరూ హాజరయ్యారు. కాగా హాలు చిన్నది కావడంతో పంచాయతీ కార్యదర్శులకు ఆరుబయట కుర్చీలే దిక్కయ్యాయి. వ్యక్తిగత మొబైల్ ఫోన్లలో వీసీ వింటూ వారు ఇబ్బంది పడ్డారు. వీడియో కాన్ఫరెన్స్‌కు అవసరమైన భవనాలు ఉన్నప్పటికీ.. వాటిని అధికారులు ఉపయోగించడం లేదని పలువురు ప్రజా ప్రతినిధులు మండిపడ్డారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీసీకి సరైన భవనాన్ని ఏర్పాటు చేయించేలా చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజాప్రతినిధులు, పలువురు అధికారులు కోరారు.